ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 21.05.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక మేరకు రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

2. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

3. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో.. తెలంగాణలో రైల్వేల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి చెప్పారు.

4. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**ముఖ్యమంత్రి**

తెలంగాణలో కార్మికులకు కనీస వేతనాల పెంపుపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం మీడియాకు వివరించారు. అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ కేటగిరీలుగా విభజించి, కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు మూడు జోన్లుగా విభజించామని చెప్పారు. జోన్-1 కింద మున్సిపల్

కార్పొరేషన్లు, జోన్-2  కింద మున్సిపాల్టీలు, జోన్ -3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు.  జోన్ -1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని 16 వేల రూపాయలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం 17 వేల రూపాయలకు, స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని  18 వేల 500 రూపాయలకు, హై స్కిల్డ్ కార్మికుల జీతాలు.. 20 వేల రూపాయలకు పెంచామన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ జీతాలు అమల్లోకి వస్తాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

డెస్క్

**పొంగులేటి**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈరోజు ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా భావిస్తూ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, అందులో 1.25 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని, జూన్ నాటికి మరో లక్ష ఇండ్లు పూర్తవుతాయని తెలిపారు. జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

పిటిసి, ఖమ్మం

**మహిళా వారోత్సవాలు**

మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 25 నుంచి 31 వరకు “మహిళా వారోత్సవాలు” నిర్వహించనుంది. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, సంస్థలు, యువతులు, బాలికలు, దివ్యాంగులు, వృద్ధులతో సహా అన్ని

వర్గాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ వారం రోజుల పాటు విభిన్న కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... మహిళా సంఘాలను కేవలం పొదుపు సమూహాలుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలకు బ్యాంకు రుణాలు, జీవనోపాధి యూనిట్లు, సూక్ష్మ పరిశ్రమలు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు వంటి అవకాశాలను గ్రామ స్థాయికే తీసుకెళ్తున్నామని చెప్పారు.

ప్రెస్ నోట్

**పొన్నం ప్రభాకర్**

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల ప్రగతిపై సమీక్ష నిర్వహించి, పదో తరగతి, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్‌లను సత్కరించారు. 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్ శిక్షణ ఇవ్వాలని, కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలని, పేరెంట్స్-టీచర్స్ మీటింగ్స్ తప్పనిసరి చేయాలన్నారు.

ప్రెస్ నోట్

**జి. కిషన్ రెడ్డి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో.. తెలంగాణలో రైల్వేల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని, రానున్న రోజుల్లోనూ రైల్వే నెట్‌వర్క్ పెంచడం, ప్రజలకు సౌకర్యాల అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ తదితర ప్రాజెక్టులపై ఇద్దరు కేంద్ర మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో.. తెలంగాణలోని 42 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా చర్చించారు. హైదరాబాద్ లో MMTS సర్వీసులు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ప్రెస్ నోట్

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తోందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...

బైట్: యెన్నం శ్రీనివాస్ రెడ్డి

పిటిసి, మహబూబ్ నగర్

**గవర్నర్ - కాళేశ్వరం**

సరస్వతీ నదీ అంత్య పుష్కరాలు ఈరోజు కాళేశ్వరంలో ప్రారంభమయ్యాయి. ఉదయం పుణ్య స్నానాలను కంచి కామకోటి పిఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, కొండ సురేఖా ఆచరించారు. తొలిరోజు పుష్కర స్నానం ఆచరించేందుకు కొద్దిసేపటి క్రితం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు కాళేశ్వరం చేరుకున్నారు. గవర్నర్ కు మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీత్ స్వాగతం పలికారు.

డెస్క్

**క్రీడా దినోత్సవం**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాల్లో భాగంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం పర్యవేక్షణలో యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి ఈ పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజల నుండి ఈ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు.

ప్రెస్ నోట్

**మహమ్మద్ అజహరుద్దీన్**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు. ఇటీవల మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమితులైన ఉజ్మా షకీర్ కూడా విజయలక్ష్మి, కొత్త సభ్యులతో కలిసి బాధ్యతలు స్వీకరించారు.

ప్రెస్ నోట్

**ఎన్. రాంచందర్ రావు**

హైదరాబాద్ లో బక్రీద్ పండుగ నేపథ్యంలో చట్ట విరుద్ధంగా కొందరు గోవులను తరలిస్తూ, గోవధకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. దేశంలో గోవధ నిషేధ చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, కొందరు కావాలనే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవులను కాపాడుకోవడానికి, చట్టాన్ని రక్షించడానికి శాంతియుతంగా ప్రయత్నిస్తున్న గోరక్షకులను, బీజేపీ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టున్నారని విమర్శించారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

ప్రెస్ నోట్

**ప్రత్యేక బస్సులు**

ఈరోజు నుండి కాళేశ్వరంలో ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలకు మంచిర్యాల నుండి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టిసి డీఎం శ్రీనివాసులు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ బస్సు మంచిర్యాల నుంచి చెన్నూర్ మీదుగా కాళేశ్వరం వెళ్తుందన్నారు.

బైట్ ... ఆర్టీసీ డి ఎం శ్రీనివాసులు

పిటిసి, మంచిర్యాల

**ములుగు జిల్లా బైట్**

ములుగు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో  జిల్లా కలెక్టర్  టోర్కడే హేమంత్ సహదేవరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

బైట్ ... హేమంత్ సహదేవరావు

పిటిసి, ములుగు

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయించాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకం జల సంచాయ్ - జన్ భాగిదారి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ... ప్రభుత్వ లక్ష్యం మేరకు కూలీలకు ఉపాధి హామీ కింద ఉపాధి హామీ కల్పించాలని సూచించారు. ప్రతి రోజు 150 మంది పనికి వచ్చేలా చూడాలని ఆదేశించారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**పర్యాటక వారోత్సవాలు**

పర్యాటక వారోత్సవాల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అంకిత్ ఈరోజు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన కిన్నెరసాని, భద్రాచలం దేవస్థానం, తుమ్మల చెరువు, బెండాలపాడు, పర్ణశాల తదితర ప్రాంతాలను సోషల్ మీడియా వేదికల ద్వారా దేశ వ్యాప్తంగా ప్రజలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాలోని స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**సింగరేణి**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మందమర్రి సోలార్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్' మంచి ఫలితాలను ఇస్తోంది. పగటిపూట మిగిలిపోయే సౌర విద్యుత్తును ఉచితంగా గ్రిడ్‌కు ఇవ్వకుండా, ఈ బ్యాటరీలలో నిల్వ చేసి అవసరమైనప్పుడు వాడుకుంటున్నారు. నాలుగు నెలల క్రితం 2 కోట్ల 50 లక్షల రూపాయలతో ఒక మెగావాట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సాంకేతికత ద్వారా గత నాలుగు నెలల్లోనే 3 లక్షల 35 వేల 485 యూనిట్ల మిగులు విద్యుత్తును నిల్వ చేసి, మళ్లీ ఉపయోగించడం ద్వారా సింగరేణికి 25 లక్షల 66 వేల 460 రూపాయల లబ్ధి చేకూరింది.

ప్రెస్ నోట్

**జర్నలిస్టుల సంక్షేమ నిధి**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ సమావేశంలో 21 మందికి ఆర్థిక సహాయం మంజూరైంది. మొత్తం వచ్చిన 29 దరఖాస్తులను పరిశీలించి, మరణించిన 17 మంది జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన నలుగురు వర్కింగ్ జర్నలిస్టులకు ఈ సాయం అందించనున్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల తక్షణ సాయంతో పాటు, ఐదేళ్ల పాటు నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ ఇవ్వనున్నారు. అలాగే వారి పిల్లల చదువుల కోసం ఇద్దరు పిల్లలకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజు మంజూరు చేశారు.

ప్రెస్ నోట్